# నిశ్శబ్ద రాగం

– కె. ఆదర్శ సామ్రాట్

ముప్పై ఏళ్ల వయసులో ప్రేమలో పడటమనేది అంత కొట్టేయాల్సిన విషయం కాదు. అందులోనూ ఆ వ్యక్తి అంతకుముందు ఎవరి వ్యామోహం లోనూ చిక్కుకోనప్పుడు.

లోకం ఏమనుకున్నాసరే జీవన్ మాత్రం ప్రేమలో పడ్డాడు. ఎం.బి.ఎ చదివి, ఒక పెద్ద ప్రైవేట్ కంపెనీలో చక్కటి ఉద్యోగంలో కుదురుకున్న అతనికి ఒకానొక శుభ సాయంత్రం అరుణ కన్పించింది. రోడ్డువారగా తల వంచుకుని వంటరిగా నడుస్తున్న అతనికి హఠాత్తుగా ఆమె ఎదురయ్యింది.

ఐదున్నర అడుగుల కంటే ఎక్కువ పొడవుతో ఒక నడిచొచ్చే జాజిలతలా వుందామె. చిన్న చిన్న పూలున్న లేత గులాబీరంగు చీర కట్టుకుంది. కోల ముఖం, విశాలమైన కళ్లు, సాయంత్రపు చిరుగాలికి నుదుటిపై అలల్లా కదులుతున్న కురులు. రెండు కనుబొమల మధ్య అందంగా అమరిన బొట్టుబిళ్ల కింద అపూర్వంగా మెరుస్తోన్న కుంకుమ. మందంగా వున్న వాల్జెడలో మౌనంగా పాడుతున్నట్లున్న మల్లెపూలు... వీటన్నిటికీ తోడు అస్తమించే సూర్యుడి కాంతి ఆమె వదనంపై ప్రతిఫలించి ఒక అపురూపమైన దృశ్యాన్ని సాక్షాత్కరింపజేస్తోంది.

స్థాణువులా నిలబడిపోయాడు. కనురెప్పలు వేయడం సైతం మరచి ఆమె వంక చూస్తుండిపోయాడు.

ఒక్క క్షణం... ఒకే ఒక్క క్షణం... ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

అతడ్ని దాటుకుంటూ ఆమె వెళ్లిపోయింది. నిర్వచించలేని శక్తి కెరటమేదో తనను ఒక్కసారిగా లాగి వదిలినట్లుగా అతడికి అన్పించింది. శరీరంలోని అణువణువూ హఠాత్తుగా కరిగిన మంచులా అయిపోయింది. మనసొక శాంతి సంతోషాల సముద్రగర్భంలా మారిపోయింది. నిశ్చలంగా ధ్యానం చేసుకుంటున్న యోగికి హఠాత్తుగా కోరుకున్నది కన్పించినప్పుడు కలిగే అనుభవం!

వెనక్కి తిరిగి ఆమె కన్పించేవరకూ చూస్తూ వుండిపోయాడు. ఆమె అడుగులు తన గుండెలోనే పడుతున్న అనుభవం. జన్మజన్మల జ్ఞాపకాలేవో ఒక్కపెట్టున ఉక్కిరి బిక్కిరి చేస్తున్న అనుభూతి!

• • •

ఆ తర్వాత అతడి ప్రతి సాయంత్రమూ ఆ ఊరి వీధుల్లో గడిచింది. తిండి, నిద్ర, ఉద్యోగం– అన్నీ యాంత్రికమైపోయాయి. ఆమె కోసం చేసే అన్వేషణలో మాత్రమే జీవితం వున్నట్లు కనిపించేది. ఆమె కన్పిస్తే చాలు అణువణువూ ఒక బృందావనమయ్యేది. కన్పించలేదో అంతా గాఢాంధకారం!

> **జీవితంలో కోరుకున్నవన్నీ దొరికినప్పుడు లభించే సంతృప్తి, పరమశాంతి ఆవరిస్తాయి. ఆ పరమశాంతిలో ఏ కోరికలూ వుండవు. కోరికలే లేనప్పుడు ఇక మాటలెక్కడివి?... ప్రతిసారీ ఇలాగే జరుగుతోంది. ఆమె దర్శనం అతడ్ని వివశుడ్ని చేస్తోంది. పలకాల్సిన మాటలు పలకకుండా చేస్తోంది.**

ఆమెను ఎప్పుడు చూసినా అదే అనుభవం. అందులో ఏమీ మార్పు రాలేదు. ఆమె కోసం అతను పడే వెర్రి తపనలోనూ మార్పు రాలేదు.

ఎప్పుడైనా ఒకసారి వాళ్ల చూపులు కలుసుకునేవి. ఓ లిప్తకాలం మాత్రమే. ఆ స్వల్పకాలంలోనే అతడి కళ్లు ఎన్నెన్నో విషయాలు చెప్పేవి. అతడి మనసులో వున్న ఆరాధన నంతటినీ దోసిళ్లతో స్వీకరించేవి. ఆ క్షణంలో ఆమె కళ్లు నవ్వీ నవ్వనట్లు – నవ్వేవి చాలా అందంగా!

ఈసారి ఆమె కన్పించగానే తన మనసులోని ఆరాధననంతా మాటల్లో పెట్టాలనుకుంటాడు. అతనికి భయంలేదు. బెరుకు అంతకన్నా లేదు. అయినా సరే ఆమె కన్పించగానే సమస్తం ఆవిరైపోయినట్లుగా మాటలు మర్చిపోతాడు. మర్చిపోవడం కాదు.

జీవితంలో కోరుకున్నవన్నీ దొరికినప్పుడు లభించే సంతృప్తి, పరమశాంతి ఆవరిస్తాయి. ఆ పరమశాంతిలో ఏ కోరికలూ వుండవు. కోరికలే లేనప్పుడు ఇక మాటలెక్కడివి?... ప్రతిసారీ ఇలాగే జరుగుతోంది. ఆమె దర్శనం అతడ్ని వివశుడ్ని చేస్తోంది. పలకాల్సిన మాటలు పలకకుండా చేస్తోంది.

రెండు వసంతాలు వచ్చి వెళ్లాయి. ఈ రెండేళ్లూ ఇదే కథ నడిచింది. ఆడ–మగలో ఒకరు హలో అనగానే మరొకరు ఛలో అనే ఈరోజుల్లో ఇలాంటి ప్రేమ కథ నడవడం విడ్డూరమే.


హఠాత్తుగా అతడి జీవితంలో ఒక పెనుతుపాను చెలరేగింది. కనీసం నెలకు రెండుసార్లయినా కన్పించే ఆమె అసలు కన్పించడం మానేసింది. ఏమై వుంటుంది? ఎందుకు కన్పించడం లేదు? అతనికి పిచ్చెక్కిపోతోంది. సృష్టిలో వున్న వేదనంతా తనను పీల్చి పిప్పి చేస్తుందా అన్నంత బాధపడసాగాడు. తన జీవితంలోంచి వెన్నెలనీ, సంతోషాన్నీ, శాంతిని ఎవరో బలవంతంగా లాక్కుపోయారన్న ఆవేదన. సెలవు పెట్టి ఆమె కోసం అదేపనిగా వెతికాడు. ఆ ఊళ్లోని ప్రతి సందూ గొందూ తిరిగాడు. ఎక్కడా ఆమె కనిపించలేదు.

అదృష్టదేవత ఒకసారే తలుపు తడుతుందంటారు. తన జీవితంలో ఆ అదృష్టదేవత రెండేళ్లు తలుపు తట్టింది. అయినాసరే ఆమె పేరేమిటో ఊరేమిటో తెలుసుకోలేదు. కనీసం ఆమె ఎక్కడ వుంటుందో కూడా తెలుసుకోలేదు.

ఈ రోడ్డుమీద ఆమె ఎన్నోసార్లు కన్పించింది. ఒక్కసారి ఆమె వెనకాలే వెళ్లివుంటే కనీసం ఆమె ఇల్లెక్కడుందో తెలిసేది. ఇప్పుడు ఎన్ని అనుకొని ఏం లాభం? అవకాశం అంది వచ్చినప్పుడు తను

మూర్ఖుడిలా ప్రవర్తించాడు. ఇప్పుడు ఆ మూర్ఖత్వా నికి తగిన పరిహారం చెల్లించాల్సిందే.

ఆమె కన్పించని ఊళ్లో వుండటం నిరర్ధకం. వెత కాలి. ఆమె ఎక్కడ వున్నాసరే వెతికి పట్టుకోవాలి. అదొక్కటే ఇప్పుడతని ఏకైక ఆశయం. ఆమెకు పెళ్లీ, గిళ్లీ అయిపోయినాసరే. ఈ ఊళ్లో కన్పించినట్లే ఆమె కన్పిస్తే చాలు. అంతకుమించి ఇంకేమీ వద్దు. ఆమెను చూడకుండా తన బ్రతుక్కి అర్ధం లేదు. ఆమె కన్పించాలి. అంతే... ఆమెని చూడాలి. అంతే... నోమోర్ డిజైర్స్...



ఎక్కడో ఒకచోట ఆమె తనకి మళ్లీ తారసపడు తుంది. ఒకవేళ ఆమె కన్పించకపోతే ఆమెను వెత కడం కోసమే ఈ జన్మను ఖర్చుపెట్టాడన్న తృప్తి మిగు లుతుంది. అది చాలదా!

• • •

"ఆ ఊళ్లో వున్నప్పుడు ఎంతో చలాకీగా వుండేదా వివి. ఊరు మారగానే ఏమయ్యిందే నీకు? జబ్బుపడ్డ మనిషిలా తయారయ్యావు?'' మందలింపుగా అంది అరుంధతమ్మ.

ఏమని జవాబు చెప్తుంది తల్లికి? ఎవరో ముక్కూ మొహం తెలీని వ్యక్తిని ప్రేమించానని చెప్తుందా? అతడ్ని చూసిన మొదటిసారే మనసులో ఓ పెను సంచలనం కలిగిందని చెప్తుందా? అతడి కోసం జన్మ జన్మల నుండి ఎదురు చూస్తున్నట్టుగా అన్పించిం దని చెప్తుందా? అతడు కన్పిస్తే చాలు హృదయం ఆనందంతో పరవళ్లు తొక్కేది అని చెబుతుందా? పని వున్నా లేకపోయినా అతడు కన్పిస్తాడనే ఆశతోనే బైటికి అడుగుపెట్టిన ప్రతిసారీ వెతికేది అని చెబుతుందా? అతడి కోసం తన సర్వస్వం అర్పించాలని తన అణు వణువూ పరితపిస్తుందని చెబుతుందా?

"నాకెందుకో మళ్లీ ఆ ఊరికే వెళ్లాలని అన్పిస్తుం దమ్మా. ఎప్పటికీ అక్కడే వుండాలన్పిస్తుంది'' తన మనసులో వ్యధ తీరే మార్గాన్ని ఈ మాటలతో మాత్రమే చెప్పగల్గింది.

"ఇదెక్కడి విడ్డూరమే! ఎవరైనా వింటే నవ్విపో తారు'' తల్లి బుగ్గలు నొక్కుకుంది.

తెలుసు అంతకుమించి ఇంకే సమాధానమూ రాదని. ఆమె వేదనగా నిట్టూర్చింది. కాని చిత్రంగా ఆరునెలలు తిరక్కుండానే ఆమె తండ్రి మళ్లీ పాత ఊరికే ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

ఆమె మనసంతా ఉద్వేగ్నతతో నిండిపో యింది.

ఆ కుటుంబం ఊరు చేరేసరికి అర్ధరాత్రి దాటిపోయింది. ఆ ఊళ్లోకి అడుగు పెట్టగానే ఆమెలో కొత్త జవజీవాలు వచ్చాయి.

ఇంకొన్ని గంటలు. అంతే... కొత్తరోజు వచ్చేస్తుంది. ఆరోజు... జన్మజన్మల నుండి తను నిరీక్షిస్తున్న ఓ అద్భుతమైన సాయం త్రాన్ని తీసుకొస్తుంది. అందమైన ఆ ఊరు రోడ్లపై అతడి అపురూపమైన సాక్షాత్కారం లభిస్తుంది. అతడి దర్శనంతో తన అణువ ణువూ ధన్యమవుతుంది. అయితే ఇంతకు ముందు తను చేసిన పొరపాటు మాత్రం ఈసారి చేయదు. అతడెవరైనప్పటికీ, ఏమైనప్పటికీ కన్పిం చిన మరుక్షణం పలకరిస్తుంది. అంతే... ఇక ముందు ఎప్పుడూ తనిలాంటి నరకతుల్యమైన వేద నని చవిచూడదు. ఆమె ఉక్కిరి బిక్కిరైపోతోంది. మరుసటిరోజు కోసం క్షణం క్షణం లెక్కిస్తోంది.

ఆమె ఆ ఊళ్లోకి అడుగుపెట్టిన క్షణంలోనే అతను ఆ ఊరు విడిచి వెళ్లిపోయాడనీ, ఏ రైలు నుంచైతే తాను దిగిందో అదే రైలులో అతను ఎక్కాడని ఆమెకు ఎవరు చెప్తారు? చెప్పినా ఆమె భరించగలదా? ఒక్క రోజు ఆమె ముందుగా వచ్చినా లేక మరొక్కరోజు అతను నిరీక్షించగలిగినా ఎంత నరకయాతనను వాళ్లు తప్పించుకోగల్గేవారో కదా!

ప్రేమ వున్నచోట సంతోషమే కాదు, విషాదమూ వుంటుంది. దాన్ని భరించగలిగేవారే ఈ ప్రపంచంలో ప్రేమించడానికి అర్హులు...

అరుణ, జీవన్‌ల ప్రేమకథ విషాదభరితమైతేనేం వారి విషాదంలో ప్రేమ వుంది... అసలైన ప్రేమ!

★